## క్లుప్తంగా

### నల్లచెరువులో పిచ్చి మొక్కల తొలగింపు



రాంజల చెరువు గట్టు పక్కన ముళ్ల పొదలు తొలగిస్తున్న దృశ్యం

**ఆదోని టౌన్ :** పట్టణానికి మంచినీటిని అందించే రాంజల నల్లచెరువులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంపీ నాగభూషణ్‌రెడ్డి పనులను పరిశీలించారు. యంత్రంతో చెరువులో పెరిగిపోయిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే..చెరువు గట్టు పొడవునా, రాంజల చెరువుకు వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్లపొదలను తొలగించారు. రాంజల చెరువులో కొంత మేర మాత్రమే నీరుందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలను కోరారు.

### 15న శనిత్రయోదశి పూజలు

**ఆదోని అర్బన్:** మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు జూలై 15వ తేదీన శనిత్రయోదశి సందర్భంగా దోష పరిహార పూజలు స్థానిక మంగరాయ సన్నిధిలో నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వేకువజామున మంగరాయ ఆంజనేయ స్వామికి తైలాభిషేకం, ఫలపంచామృతాభిషేకం, ప్రత్యేకంగా పూలు, వెండి, మహామంగళహారతి పూజలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం శనీశ్వరస్వామికి తిలతైలాభిషేకం, మృత్యుంజయహోమం, శాంతిహోమం చేస్తామన్నారు. పూజలు చేయించుకునే వారు ఆలయ మేనేజర్ 9985706489 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### 15న ప్రత్యేక పూజలు

**ఆదోని అర్బన్:** వర్షాలు సమృద్ధిగా కురవాలని స్థానిక సంతపేటలో వెలిసిన శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం నాగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు మహర్షి విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నాగలింగేశ్వరస్వామికి జలాభిషేకం, నవగ్రహ శాంతి, శనిగ్రహ శాంతి పూజలు ఉంటా యని చెప్పారు. 1008 బిందెలతో నాగలింగేశ్వరస్వామికి జలాభిషేకం చేస్తామని పేర్కొన్నారు.

### నేడు వైస్ ఎంపీపీ-1 ఎన్నిక

**పెద్దకడబూరు :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు - 1 ఎన్నిక ఉంటుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరమేష్‌గౌడ్ ఇటీవల గుండెపోటుతో అకాల మరణం పొందిన విషయం తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో గత నెలలో నిర్వహించిన ఎన్నికలకు కోరం లేకపోవడంతో వాయిదా వేశామని, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎన్నిక చేపడుతున్నట్లు వివరించారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

### అన్నదమ్ముల ఘర్షణలో ఒకరికి గాయాలు

**కోసిగి:** మండలంలోని గొడుగల్లు గ్రామంలో అన్నదమ్ముల ఘర్షణలో మారెన్న అనే వ్యక్తికి తీవ్ర రక్త గాయమైంది. పొలాలకు సంబంధించిన తగాదాలతో ఘర్షణ చోటుచేసుకోగా అన్న తిక్కయ్య ఇనుప రాడ్డుతో దాడి చేశారని బాధితుడు మారెన్న వాపోయాడు. రక్త గాయంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

### పుస్తకాల పంపిణీ

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని బార్‌పేటలో అల్ ఫలాహ్ ఎడ్యుకేషన్ వేల్ఫేర్ సొసైటీ ఉర్దూగర్ ఆధ్వర్యంలో ఉర్దూ, అరబిక్ విద్యార్థులకు బుధవారం పుస్తకాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి, ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మజీర్ అహ్మద్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. నియాజ్ అహ్మద్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆలూరు రూరల్:** ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం ప్రకటలో వెల్లడించారు. 2023-24 ఏడాదికి గాను ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులు కోరడమైందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ కోసం కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్ మెన్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉన్నాయన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

**ఆలూరు:** ఆస్పరి మండలం నగరూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ సద్గురు మహాదేవప్ప తాత ఆలయం నిర్వహణ ఖర్చులకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుమ్మనూరు నారాయణస్వామి బుధవారం రూ.75 వేలు విరాళం అందజేశారు. స్థానిక మంత్రి నివాసంలో ఆయన ఆలయ నిర్వాహకులకు అందించారు.

# జగనన్న విజయాన్ని ఎవరూ ఆపలేరు

- పవన్ కళ్యాణ్‌కు దమ్ముంటే సింగిల్‌గా పోటీ చేయాలి
- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

**మంత్రాలయం:** రానున్న సాధారణ ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారీ సీఎం కావడం ఖాయమని, ఆయన విజయాన్ని ఎవరూ ఆపలేరని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో నూతనంగా రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ వార్డు సచివాలయం, రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను వైఎస్సార్‌సీపీ నేత విశ్వనాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సేవలు అవసరమో వారి ఇళ్ల వద్దకు వలంటీర్లను పంపి మరీ తెలుసుకొని అందజేస్తున్నారన్నారు. పథకాలకు అర్హులు దూరం కాకుండా ధ్రువ పత్రాలు అందజేసి వారిని లబ్ధిదారులుగా మారుస్తున్నారని, ఇలాంటి సీఎం మునుపెన్నడైనా చూశారా అంటూ ప్రజలను ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌కు దమ్ము ఉంటే సింగిల్‌గా పోటీ చేయాలని సవాల్ విసిరారు. నారా చంద్రబాబు కన్నా నారా లోకేష్ పెద్ద ఐరన్ లెగ్ అని, ఆయన పాదయాత్రతో వరుణుడు వెనక్కి వెళ్లిపోయాడన్నారు. రైతు సంక్షేమానికి కృషి చేసింది గతంలో రామారావు, వైఎస్సార్...ఇప్పుడు సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొరవడింది అని అనేవారు గ్రామాల్లో తిరగాలని సూచించారు. రైతులకు అందించే నీటిని కూడా దోచుకున్న చరిత్ర మీదని ఎద్దేవా చేశారు. రచ్చుమర్రి గ్రామంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ప్రతి నెలా రూ.14 లక్షలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రావడంతో సకాలంలో పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన కురువ లసుమప్పను ఎమ్మెల్యే అభినందించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీహో మణిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, డీటీ సరస్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, ఏవో జీరాగణేష్, ఏఈవో నరసింహ, పీఆర్ జేఈ న రసింహులు, వైద్యాధికారి సురేష్, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వినోద్‌కుమార్,జెడ్పీటీసీ సభ్యురాలు మజ్జిగ గోవిందమ్మ, ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, కోసిగి జయలక్ష్మి, సర్పంచ్ మేకల సుజాత, వైస్ సర్పంచ్ నెమలికల్లు గోవిందమ్మ, మాజీ వైస్ ఎంపీపీ వెంకోబా నాయకులు డీలర్ బొజ్జప్ప, రవిరెడ్డి, రొగప్ప, లక్ష్మయ్య, మేకలనారాయణ, పెద్దయ్య, కోసిగి నారాయణ, ఈరన్న,దుబ్బన్న, నరసింహులు, రామాంజి, రాజు ఉన్నారు.



ధ్రువ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# భవనాల నిర్మాణానికి స్థలాల పరిశీలన

- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి
- జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

**ఆదోని రూరల్ :** ప్రభుత్వ భవనాలు, నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించిన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఆదోని పట్టణంలోని ఆస్పరి రోడ్డులోని బైపాస్ రహదారికి సంబంధించిన స్థలాన్ని, ఎమ్మిగనూరు రోడ్డులోని ఎస్.కొండాపూర్ గ్రామ సమీపంలోని ఆర్డీట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కపటి రోడ్డులోని పౌర సరఫరాల గోదాము, పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామ సమీపంలో పౌరసరఫరాల గోదాము కోసం భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలోనే నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని జేసీ చెప్పారు.

**ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ**

ఆదోని సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాలను జేసీ తనిఖీ చేశారు. కార్యాలయంలోని ప్రతి సెక్షన్, కంప్యూటర్ రూం, రికార్డు రూములను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని చెప్పారు. వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల అధికారులు మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు అందితే విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, మండల సర్వేయర్ రమణ తదితరులు ఉన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్



పాతకాలం నాటి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

**పెద్దకడబూరు :** మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలో పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్ గోడౌన్ నిర్మించడానికి అవసరమైన స్థలాన్ని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర నారపు రెడ్డి మౌర్య బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్థలానికి సంబందించిన నివేదికను సిద్ధం చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ వీరేంద్ర గౌడ, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

## తుంగభద్రలో ఘనంగా పునఃప్రతిష్ఠ వేడుకలు

**మంత్రాలయం రూరల్:** మండలంలోని తుంగభద్ర గ్రామంలో రాఘవేంద్రస్వామి మృత్తిక బృందావనం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. రూ.40 లక్షలతో రాఘవేంద్రస్వామి మఠాన్ని పునర్నిర్మించారు. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు చేపట్టారు. అనంతరం నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభించారు. మఠంలోనే సంస్థాన పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేను పీఠాధిపతి శాలువా, ఫలమంత్రాక్షితలు, మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు. మఠం మేనేజర్ వెంకటేశ్ జోష్యి, విశ్రాంత అధికారులు ఈఈ సురేష్, విద్యాపీఠం ప్రిన్సిపాల్ వాదీంద్రాచార్ పాల్గొన్నారు.



కలశాలకు హారతి ఇస్తున్న పీఠాధిపతి

## గృహ హింస కేసులో రెండేళ్ల జైలు

**ఆదోనిరూరల్ :** మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన జి.మల్లికార్జునపై గృహ హింస కేసు నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఆదోని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజ్రిస్టేట్ వీరవెంకట నాగలక్ష్మి తీర్పునిచ్చారని ఆదోని తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజ్రిస్టేట్ ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు చెప్పారు. ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్‌లో జి.మల్లికార్జునపై 2013లో కేసు నమోదు కాగా తుది తీర్పులో శిక్ష విధించారని పేర్కొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ఆదోని రూరల్ :** మండలంలోని పెద్దతుంబళం గ్రామ శివారులో గ్రామానికి చెందిన బోయ రాజేష్ అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. రాజేష్ వ్యక్తి మో టార్ సైకిల్‌పై ఐదు కర్ణాటక మద్యం బాక్సులు రవాణా చేస్తుండగా దాడి చేసి మద్యంను స్వాధీనం చేసు కొని నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పా రు. ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.



రూపుదిద్దుకున్న సంతపేట పురపాలక ప్రాథమిక పాఠశాల

# మారిన బడి..

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని సంతపేట పురపాలక ప్రాథమిక పాఠశాల రూపు రేఖలు నాడు-నేడు పనులతో పూర్తిగా మారిపోయాయి. నాడు-నేడు మొదటి దశలో రూ. 23 లక్షలు మంజూరవగా పలు మరమ్మతులు, విద్యుత్, టాయిలెట్స్, బాత్‌రూమ్స్, కాంపౌండు, గేట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల అవరణతో పాటు పరిసరాలను తీర్చిదిద్దారు. ప్రస్తుతం పాఠశాలలో 1 - 5వ తరగతి వరకు 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదు గదులు ఉండగా అందులో ఒక గదిని అంగనవాడీ కేంద్రానికి కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే..నాడు-నేడు రెండవ దశలో అంగనవాడీ కేంద్రంగా నిర్ణయించిన గదిని అహ్లాదంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ. 2.50 లక్షలు విడుదల చేసింది. నిబంధనల మేరకు పనులు చేయిస్తున్నట్లు హెచ్ఎం హనుమంతు తెలిపారు.



బొమ్మలను గీస్తున్న పెయింటర్




గోడపై ఆకట్టుకునేలా బొమ్మలు

## ఉరుకుంద ఈరన్నస్వామి వృషభం మృతి



మృతి చెందిన వృషభం

**కౌతాళం:** ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయానికి చెందిన వృషభం అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. 15 సంవత్సరాలుగా దేవాలయ పరిసరాల్లో ఉంటూ స్వామి వారి ఎద్దుగా భక్తులు భావించి పూజలు చేసేవారు. తిమ్మపురం గ్రామ పొలాల్లో ఎద్దు మృతి చెందడంతో అక్కడే పలువురు అంత్యక్రియలు నిర్వహించారు.

## నూతన కమిటీ ఎన్నిక

**కోసిగి:** దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) మండల నూతన కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ , సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడుగా తిక్కయ్య, మండల ప్రధాన కార్యదర్శి జుమ్మాలదిన్నె రాజు, మండల ఉపాధ్యక్షులు కృష్ణ, నల్లన్న, వీరేష్, మండల సహాయ కార్యదర్శులుగా బాబు, ఈరన్నను ఎన్నుకున్నారు.

## రాహుల్‌గాంధీని బీజేపీ ఇబ్బందులు పెడుతోంది

**ఆదోని రూరల్ :** కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ఎంపీ రాహుల్‌గాంధీని కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిలీప్‌డోకా పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా విజయవాడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన మౌన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా మౌన దీక్ష చేపట్టారు. నాయకులు మారుతీరావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, మనియర్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను పరిశీలించాలి

**మంత్రాలయం రూరల్:** గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని ఆర్వో ఎస్.రమా సూచించారు. బుధవారం మంత్రాలయం హెచ్చార్బీ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి బీఎల్‌వోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిశీలనలో జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆధార్‌కార్డు, డోర్ నంబరు, ఫొటో, వయస్సు, ప్రాంతం, ఇక్కడ ఉన్నారా? లేదా? చనిపోయారా? తదితర అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. నాలుగు మండలాల తహసీల్దార్లు చంద్రశేఖర్, రుద్రగౌడు, వీరభద్ర, ఎన్నికల డీటీ తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్ల సేవలు

### ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందజేశాడు..

ఈ ఫొటోలో కర్నూలు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పేరు వీరారెడ్డి. కోసిగి దుర్గిగేని వీధిలో నివాసం ఉంటున్నాడు. ఐదు నెలల క్రితం గుండెపోటు రావడంతో ఆసుపత్రిలో చేరాడు. గతంలో ప్రమాదవశాత్తు కాలు విరిగిపోవడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం ఆయనకు ప్రభుత్వం దివ్యాంగుల కోటా కింద పింఛన్ అందజేస్తుంది. అయితే పింఛన్ వచ్చే సమయంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల పింఛన్ అందదేమోనని మదనపడుతున్న సమయంలో వలంటీర్ వెంకటేష్ ఆసుపత్రికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేశాడు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వెంకటేష్

**“ చెప్పకపోయినా వచ్చి పింఛన్ ఇచ్చాడు..**



తాను ఆసుపత్రిలో ఉన్నానని వలంటీర్‌కు సమాచారం ఇవ్వకపోయినా, తన ఇబ్బందులను తెలియజేయకపోయినా కర్నూలులోని ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందజేయడం సంతోషంగా ఉంది. ఆయన రాకపోతే తాను ఎన్నో ఇబ్బందులు పడేవాడిని. 12ఎంఎల్ఎం71బి.వీరారెడ్డి, దివ్యాంగుడు

### ఆపద సమయంలో అండగా నిలిచాడు..

ఈ ఫొటోలో చికిత్స పొందుతున్న చిన్నారి పేరు శిరీషా. కోసిగికి చెందిన సంజీవయ్య, భవాని దంపతుల కుమార్తె అయితే ఈ బాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ బాలిక పుట్టుకతోనే మూగ, చెవుడు. ప్రస్తుతం దివ్యాంగుల కోటాలో పింఛన్ అందజేస్తుంది. నాలుగు నెలల క్రితం పింఛన్ వచ్చే సమయానికి హాస్పిటల్‌లో చేర్పించారు. ఇక ఈనెల పింఛన్ అందదేమో అనుకున్న సమయంలో వలంటీర్ వెంకటేష్ ఆసుపత్రికి వెళ్లి పాప వేలిముద్రలు తీసుకొని పింఛన్ సొమ్ము రూ.3వేలు అందజేశాడు.



శిరీషకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటేష్

**“ ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాం..**



తమ బిడ్డను ఆసుపత్రిలో చేర్పించిన సమయంలో ఆర్థికంగా బాగా ఇబ్బందులున్నాయి. ఒక పక్క మందులు, మరో పక్క మా దినసరి ఖర్చు. డబ్బులు లేకపోవడం, పింఛన్ అంది ఉంటే బాగుండు అనుకుంటుండగా దేవుడిలా వచ్చి వలంటీర్ పింఛన్ సొమ్ము అందజేశాడు. దీంతో మాకు ఇతరులను డబ్బులు అడిగే పరిస్థితి తప్పింది. తాము ఎక్కడున్నా అక్కడికి వచ్చి పథకాలు వర్తింపజేసేలా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అభినందనీయం.

# పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

**కోసిగి :** పవన్ కళ్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోసిగి వలంటీర్లు అంజి,సుందర రాజు, వెంకటేష్, గోపాల్, మాధవి, జయశ్రీ,అశ్విని డిమాండ్ చేశారు. జనసేన అధినేత వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం వారు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ పవన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడలని హితవు పిలికారు. కరోనా సమయంలో హైదరాబాద్‌లో దాక్కున్న దత్తపుత్రుడికి వలంటీర్ల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. తాము బానిసలం కాదని ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని చెప్పారు. ప్రజా సేవ చేసే వలంటీర్లను చులకన చేసి మాట్లాడడం తగదన్నారు. వలంటీర్లు వీరేష్, నర్సారెడ్డి, వీరారెడ్డి, అంజిరెడ్డి, బాబయ్య పాల్గొన్నారు.



కోసిగిలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

# జగనన్న సురక్షతో సమస్యలకు చెక్



ధ్రుపత్రాలను అందజేస్తున్న దృశ్యం

**కౌతాళం:** జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లో సమస్యలకు పరిష్కారం లభించిందని ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని రొడూరు గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి టీం, ఉరుకుంద గ్రామంలో ఎంపీడీఓ సుబ్బారాజు టీంలు జగనన్న సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఉరుకుందలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ పాల్గొన్నారు. రొడూరు గ్రామంలో వలంటీర్లను సన్మానించారు. సర్పంచ్ సుశీలమ్మ, నాయకులు సుధాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, పాండురెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, నాయకులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

# దరఖాస్తుదారులందరికీ ధ్రువపత్రాలు అందాలి

**ఆలూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ధ్రువ పత్రాలు అందించాలని ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక సచివాలయం -2ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని 17 సచివాలయాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు స్వీకరించి ఉచితంగా అందించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 879 సర్టిఫికెట్లు అందించినట్లు మండల అధికారులు ఆయనకు తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అల్లబకాష్‌తో కలిసి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.



ఆలూరు సచివాలయం-2ను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

## డ్రాపౌట్స్ నివారించండి

**చిప్పగిరి:** మండలంలోని విద్యార్థులు ఎక్కువగా డ్రాప్ అవుతున్న పాఠశాలలపై దృష్టి పెట్టాలని ఎంఈఓ బాలనాయుడును పీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్ ఆదేశించారు. బుధవారం మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై స్థానిక ప్రజాపరిషత్ కార్యలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బడి నుంచి ఎందుకు డ్రాప్ అవుతున్నారో కారణాలు తెలుసుకుని వాటిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ సంజన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంసీలా, ఏపీఎం నాగార్జున, హౌసింగ్ ఏఈ భవ్య, కార్యదర్శులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంఈఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీఓ, స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్

## నూతన భవనం నిర్మించాలి

**ఆదోని రూరల్ :** మండలంలోని గణేకల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. బుధవారం శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం పరిసరాల్లో వర్షపునీరు చేరి, డ్రైయినేజీ నీరు మొత్తం కేంద్రంలోకి చేరి వర్షాకాలంలో పిల్లలు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీరేష్, చిన్నమల్లయ్య, మారెప్ప, లోకన్న ఉన్నారు.